



సారాకు అడ్డుకట్ట పడేనా?

- జిల్లాలో జోరుగా విక్రయాలు
- ఒడిశా నుంచి దిగుమతి
- నియంత్రణ చర్యలు అంతంత మాత్రమే



● గత 28న పాలకొండకు చెందిన ఓ వ్యక్తి వివాహానికి విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం రాచపేట గ్రామానికి చెందిన 10 మంది వ్యక్తులు వచ్చారు. పెళ్లి విందు సందర్భంగా వీరందరికీ సారా పంపిణీ చేశారు. ఇది తాగిన అనంతరం ఆటోలో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఓ వ్యక్తి మృతి చెందగా, మిగతా వారిని ఆస్పత్రికి తరలించారు.

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సారా ఏరులై పారుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటి నియంత్రణకు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు చేపడుతున్న చర్యలు సఫలీకృతం కావడం లేదు. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు భామిని, సీతంపేట, కొమరాడ, కురుపాం, గరుగుబిల్లి, మక్కువ, సీతానగరం, బలిజిపేట, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల్లో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి విచ్చల విడిగా సారా దిగమతి చేసుకుని పెద్ద ఎత్తున విక్రయాలు చేపడుతున్నారు. నియంత్రణ చర్యలు కానరాక పోవడంతో సారా వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను తెరపైకి తెచ్చింది. ఎక్సైజ్ శాఖకు కేవలం మద్యం విక్రయాల బాధ్యతను అప్పగించింది. ఎస్ఈబీ సిబ్బందికి మద్యం, సారా, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ బాధ్యతలను అప్పగించింది. ఎస్ఈబీ సిబ్బందితో పాటు పోలీసులు సారా తయారీదారులపై దాడులు చేసి బెల్లం ఊటలను ధ్వంసం చేయాల్సి ఉంది. అలాగే, సారాను స్వాధీనం చేసుకుని తయారీదారులపై కేసులు నమోదు చేయాల్సి ఉంది. కానీ, ఎస్ఈబీ సిబ్బంది సారా నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఎస్పీగా పనిచేసిన విద్యాసాగర్‌నాయుడు సారా విక్రయించే వారిని పీడీ యాక్ట్ కింద అరెస్టు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి జిల్లాలో కానరావడం లేదు.



సీతంపేట మండలం కుడ్డపల్లి వద్ద సారా తయారీ కేంద్రంపై దాడి చేసిన పోలీసులు(ఫైల్)

ధర తక్కువ కావడంతో..

మద్యం ధరలు అమాంతం పెరగడం కూడా సారా విక్రయాలు పెరగడానికి ఒక కారణం. ప్రస్తుతం క్వార్టర్ మద్యం (చీప్) కొనుగోలు చేయాలంటే రూ.150 పైమాటే. బార్లలో లభించే బ్రాండెడ్ మద్యం ధర చెప్పనక్కర్లేదు. అదే సారా అయితే తక్కువ ధరకు వస్తోంది. రూ.50 పెడితే సీసా సారా దొరుకుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది సారా తాగుతున్నారు. ఎటువంటి నిఘా లేకపోవడంతో పెద్ద ఎత్తున జిల్లాకు దిగుమతి అవుతున్నట్టు తెలుస్తోంది. వాహనాల్లో సారా దిగుమతి చేసుకుంటున్నట్టు సమాచారం.

● గత నెల 12న ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 120 లీటర్ల (6 ప్లాస్టిక్ క్యాన్లు) సారాను చినమేరంగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాము ఒడిశా రాష్ట్రం సందుబడి నుంచి సారాను తీసుకుచ్చినట్లు నిందితులు తెలిపారు.

బెల్ట్‌షాప్‌లకు మద్యం సరఫరా..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బెల్ట్‌షాప్‌లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వీధికొక బెల్ట్‌షాప్ దర్శనమిస్తోంది. వీటికి ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు బారుల నుంచే మద్యం సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ సీసాపై రూ.50 నుంచి రూ.70 అధికంగా విక్రయించి బెల్ట్ దుకాణదారులు మందుబాబులను దోచుకుంటున్నారు. ఇందులో కొంత వాటా మద్యం దుకాణాల ఉద్యోగులకు వెళ్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ పోలీసులు తూతూ మంత్రంగా దాడులు చేసి వదిలేస్తున్నారు. మద్యం సీసాలు పట్టుబడినా స్వాధీనం చేసుకోకుండా బెల్ట్ నిర్వహకుల నుంచి ఎంతోకొంత తీసుకొని వదిలేస్తున్నారే విమర్శలు ఉన్నాయి.

ఎన్నికల వేళ కట్టడి జరిగేనా?

మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే ముఖ్యంగా సారా, మద్యం అక్రమ విక్రయాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. సారా విక్రయాలు, తయారీపై ఉక్కుపాదం మోపాలి. బెల్ట్‌షాపులకు ఎక్కడ నుంచి మద్యం వెళ్తుందో తెలుసుకొని దానికి అడ్డుకట్ట వేయాలి. పోలింగ్ నాడు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడతాయి. కానీ, బెల్ట్‌షాపుల ద్వారా విచ్చలవిడిగా అమ్మకాలు జరిగే అవకాశం ఉంది. వీటిని అడ్డుకోకపోతే మందుబాబులు రెచ్చిపోయి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది.

చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం..

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. సారా నియంత్రణకు శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నాం. బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి.

-దిలీప్‌కిరణ్, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

● మున్సిపల్ నూతన కమిషనర్ శ్రీనివాసరావు



పార్వతీపురం టౌన్, మార్చి 12: పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని పార్వతీపురం మున్సిపాల్టీ నూతన కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. నిడదవోలు నుంచి బదిలీపై పార్వతీపురం వచ్చారు. మంగళవారం సాయంత్రం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పట్టణ ప్రజలను వేధిస్తున్న తాగునీరు, పారిశుధ్య నిర్వహణ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత విభాగాల అధికారుల సహకారంతో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తా. వివిధ అభివృద్ధి పనులను ఎన్నికల కోడ్ వచ్చేలోగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తా. బుధవారం నుంచి విభాగాల వారి సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశాలను నిర్వహిస్తా' అని తెలిపారు.

దీవించమ్మా పోలమాంబ

● జాతరకు పోటెత్తిన భక్తులు



చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ, మార్చి 12: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ ఎనిమిదో వారం జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. వనం గుడి వద్ద వేపచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోముకి నదీ తీరాన కోళ్ల, చీరలు, మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి సమీప తోటల్లో చెట్ల కింద వంటావార్పు చేపట్టి సేదతీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ ఈవో వీవీ సూర్యనారాయణ తగు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబినాయన దరించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో శంబర ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, పూడి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



శంబర పోలమాంబ అమ్మవారు



ఫ్లైఓవర్‌పై నిలిపేసిన భారీ వాహనాలు

ఫ్లైఓవర్‌పై ఆపేస్తున్న భారీ వాహనాలు

● నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

పార్వతీపురం టౌన్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై భారీ వాహనాలను ఎక్కడిపడితే అక్కడే నిలిపేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారాం బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపేయడంతో పార్వతీపురంలో వై ఫ్లైఓవర్ గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. కిలోమీటరన్నర పొడవున్న ఈ వంతెన మీదుగానే అటు శ్రీకాకుళం, ఇటు విశాఖకు వాహ నాలు వెళ్తుంటాయి. అయితే, ప్రతిరోజూ ఫ్లైఓవర్‌పై భారీ వాహనాలు ఎక్కడ పడితే అక్కడే ఆపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫ్లైఓవర్ సామర్థ్యానికి మించి భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో పెద్ద పెద్ద శబ్ధాలు వస్తుండడంతో చుట్టు పక్కల నివాసితులు, వ్యాపారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుండడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. జిల్లా కేంద్రానికి అవతల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోతుంది.

బిల్లులు చెల్లిస్తేనే భవనాలు అప్పగిస్తాం

● తేల్చిచెబుతున్న కాంట్రాక్టర్లు ● అద్దె భవనంలో కొనసాగుతున్న గరుగుబిల్లి సచివాలయం

గరుగుబిల్లి, మార్చి 12

మండలంలో పలు సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయినా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు అందలేదు. దీంతో ఆ భవనాలను వారు అధికారులకు అప్పగించడం లేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తేనే తాము ఆ భవనాల తాళాలను అధికారులకు అందిస్తామని స్పష్టం చేస్తు న్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలో సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 43 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది. చిన్నపాటి పనులు తప్ప ప్రారంభానికి సిద్ధమైంది. కాంట్రాక్టర్‌కు గతంలో సుమారు రూ.20 లక్షలు చెల్లింపులు జరిగాయి. మరో రూ.21 లక్షలు రావాల్సి ఉంది. అయితే, ఈ భవనాన్ని అప్పగించాలని అధికారులు కోరగా కాంట్రాక్టర్ అంగీకరించలేదు. తనకు రావలసిన బిల్లు మొత్తం చెల్లిస్తేనే భవనం తాళాలు ఇస్తానని, లేదంటే ఇవ్వనని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. దీనిపై సంబంధిత సచివాలయ కార్యదర్శి డి.జగదీశ్వరరావును వివరణ కోరగా.. 'బిల్లుల చెల్లింపునకు అవసరమైన ప్రతిపాదనలు చేశాం. రూ.6 లక్షలకు స్లాట్‌బుక్ చేశాం. మరో రూ.15 లక్షలకు ఎంబుక్ తయారు చేశాం. ప్రస్తుతం అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. కాంట్రాక్టర్‌కు నూతన భవనాన్ని అడిగితే అప్పగించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని' తెలిపారు.



గరుగుబిల్లిలో పూర్తయిన నూతన సచివాలయ భవన నిర్మాణం

ప్రతిపాదనలే మిగులుతున్నాయి

● ఆశ్రమ పాఠశాలల్లో భర్తీకాని నాల్గో తరగతి ఉద్యోగాలు

● మూడు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి..

సీతంపేట, మార్చి 12: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టుమెట్రిక్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో మూడు దశాబ్దాలుగా నాల్గో తరగతి ఉద్యోగుల నియామకాలు చేపట్టడం లేదు. ప్రతి ఏటా ప్రతిపాదనలు చేయడమే తప్ప పోస్టులను మాత్రం భర్తీ చేయడం లేదు. వాస్తవానికి ప్రతీ వంద మంది విద్యార్థులకు కుక్, కమాటీ, వాచ్‌మేన్ పనిచేయాల్సి ఉంది. 30 ఏళ్ల క్రితం 204 మంది నాల్గో తరగతి ఉద్యోగాలను సీతంపేట ఐటీడీఏకు కేటాయించారు. వీరిలో అనారోగ్యంతో మృతి చెందిన వారు, పదవి విరమణ చేసిన వారు 112 మంది వరకు ఉన్నారు. మిగిలిన 97 మంది మందిని అనధికారి కంగా ఆశ్రమ పాఠశాలల్లో సేవలకు వినియోగిస్తున్నారు. వీరికి ఎటువంటి జీతాలు ఇవ్వకపోవడంతో ఆదివాసీ నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎస్టీ కమిషన్ కూడా తీవ్ర స్థాయిలో స్పందించింది. సంబంధిత అధికారులకు నోటీసులు కూడా జారీ చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టకపోవడంతో సంబంధిత హాస్టల్ నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాల్గో తరగతి ఉద్యోగ నియామకాలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర వద్ద వివరణ కోరగా.. నాలుగో తరగతి ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు రాలేదని తెలిపారు.



ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల

స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలి

● పార్వతీపురంలో వన్ స్టేషన్-వన్ ప్రాడెక్ట్ స్టాల్

● వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

బెలగాం, మార్చి 12: స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం పార్వతీపురం రైల్వేస్టేషన్ (బెలగాం)లో వన్ స్టేషన్-వన్ ప్రాడెక్ట్ స్టాల్‌ను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎం మాట్లాడుతూ. దేశంలో రైల్వే వ్యవస్థ చాలా పటిష్టమైనదని తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా రూ.11 లక్షల కోట్లతో రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. వన్ స్టేషన్-వన్ ప్రాడెక్ట్ ముఖ్య ఉద్దేశం స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెరగడం, విదేశీ వస్తు వినియోగం తగ్గించడం అన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగంతో ఆరోగ్యకరమైన భారతదేశాన్ని చూడవచ్చని ఆకాంక్షించారు. పార్వతీపురం రైల్వేస్టేషన్ ఆధునీకీకరణ పనులు చేపట్టామన్నారు. దేశంలో 504 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని, అన్ని స్టేషన్లు ఒకేలా ఉండాలని, పరిశుభ్రంగా ఉంచు కోవాలని పిలుపునిచ్చారు. రైల్వే వ్యవస్థలో లోకోషెడ్స్, కమ్యూనికేషన్ వ్యవస్థ, రైల్వే లైన్లను బలోపేతం చేశామన్నారు. ప్రతి రాష్ట్రంలో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ మ హేంద్ర కుమార్, రైల్వే సీఈవో అశోక్ కుమార్, ఏఐడీఎస్ సాలూరు మురళీ కృష్ణ, సాలూరు మాజీ మున్సిపల్ చైర్మన్ జరజాపు ఈశ్వరరావు, స్టేసన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, భాస్కర్ సంస్థల అధినేత చుక్క భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వన్ స్టేషన్-వన్ ప్రాడెక్ట్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్ర కుమార్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరంలో జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల కన్వీనర్ మూలక పెంటయ్య ఒక ప్రకటన లో పేర్కొన్నారు. 9-11 ఏళ్ల బీసీ, ఈబీసీ విద్యార్థులు, 9-13 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులని చెప్పారు. హెచ్‌టీటీపీఎస్:// ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 రుసుం చెల్లించాలని చెప్పారు. ఏప్రిల్ 27న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.

జగన్ రాష్ట్ర ప్రజలను వంచించారు: కోండ్రు



పార్టీలో చేరిన వారితో కోండ్రు

రాజాం: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలను సీఎం జగన్ నయవంచనకు గురిచేశారని, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలం దోసరి గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీకి చెందిన వారు భారీగా టీడీపీలో చేరడం శుభపరిణామం అన్నారు. గురవాన నారాయణరావు. దుప్పపూడి శ్రీనివాసరావు. కరణం శివవశంకరరావు, వైసీపీ పార్టీకి చెందిన వారు కరణం లక్ష్మణ రావు తదితరులు ఉన్నారు. ● పురపాలక సంఘ పరిధిలోని 7వ వార్డు శ్రీనివాసకాలనీ, కూరాకవీధి, ఆదినారాయణకాలనీ, గణేస్‌నగర్, కొండంపేట, సారధి రోడ్డులో మంగళవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ వ్యాపార వర్గాలను కలిసి టీడీపీకి ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రజలు కోండ్రుకు మంగళ హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించారు. పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, కోండ్రు జగదీష్, గుడివాడ ఉత్తరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. వివిధ రకాల పువ్వులతో అమ్మవారిని అలంకరించారు. బూరెలను నైవేద్యంగా సమర్పించారు.



పైడిమాంబకు బూరెల నైవేద్యం

2029లో కాంగ్రెస్‌దే అధికారం

జామి: షర్మిల నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ 2029 సార్వత్రిక ఎన్నికల్లో అధికారం చేపట్టబోతోందని మండలపార్టీ అధ్యక్షుడు బోని అప్పారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజశేఖర్‌రెడ్డి సిద్ధాంతాలను అమలుచేసేది కాంగ్రెస్ అన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసున్నారు. జామి ఎల్లారమ్మ జాతరను అన్ని వర్గాలనూ కలుపుకుని దేవదాయశాఖ విజయవంతం చేయాలని కోరారు.

పుణ్యగిరి హుండీ ఆదాయం రూ.5,56,395

శృంగవరపుకోట: పుణ్యగిరి మహా శివరాత్రి జాతర హుండీ ఆదాయం 5,56,395 వచ్చినట్టు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, శ్రీపైడితల్లమ్మ ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి డీవీవీ ప్రసాద్, పాలక మండలి చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ సమక్షంలో మంగళవారం హుండీ లెక్కించామని చెప్పారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం

రాజాం రూరల్: పట్టణంలోని సూర్యదుర్గ కల్యాణ మండపంలో బుధవారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్న సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పాల్గొంటారని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రామ్‌కుమార్ శర్మకు సత్కారం

విజయనగరం రింగురోడ్డు: జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘ అధ్యక్షులు బమ్మిడిపాటి రామ్‌కుమార్ శర్మను సత్కరించారు. 'జ్యోతిష శిరోమణి' అవార్డు అందుకున్న సందర్భంగా పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

రాజాం రూరల్: కోర్టు ప్రాంగణంలో ఈనెల 16న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

నేటి నుంచి క్రాష్ ప్రోగ్రాం

బాడంగి: రానున్న వేసవి దృష్ట్యా మండలంలోని 429 బోర్లలో ఎక్కడైనా మరమ్మతులకు గురైతే యుద్ధ ప్రాతిపదికన అక్కడికక్కడే బోర్లను రిపేరు చేస్తామని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 13నుంచి వచ్చే నెల 25 వరకు గ్రామాల్లో బోరు మెకానిక్‌లు తిరిగి పాడైన బోర్లకు మరమ్మతులు చేసి ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజ లకు తాగునీరు అందించే కార్యక్రమం చేపడుతున్నారని, పంచాయతీల పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు బోర్లు ఎక్కడెక్కడ మరమ్మతులకు గురయ్యాయో ముందుగా సమాచారం అందజేసి బోర్లకు మరమ్మతులు చేపడతామన్నారు. ● **రేగిడి:** మండలంలో వివిధ గ్రామాల్లో పాడైన బోర్లు బాగుచేసేందుకు మంగళవారం మండల కేంద్రంలో క్రాస్ ప్రోగ్రాం కింద ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీ జగన్మోహనరావు ఈ వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఈప్రోగ్రాంను విని యోగించుకోవాలని కోరారు. మండల పరిషత్ ఏవో నాగ మణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

దిబ్బగుడ్డివలసలో వైద్య శిబిరం

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొని రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్య దర్శి ఉడమల వెంకటనాయుడు, ఇతర ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

గోపాలపురంలో కమిషనర్ పర్యటన

రాజాం: పురపాలక సంఘం కమిషనర్ నారా అప్పలనాయుడు మంగళవారం గిరిజన గ్రామం గోపాలపురంలో పర్యటించారు. గ్రామంలో కాలువలు సీసీ రోడ్లను పరిశీలించారు. రక్షిత మంచినీటి పథకం వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఏఈకి ఆదేశించారు. సీసీ రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జగన్ బీసీ ద్రోహిగా మిగిలిపోతారు

ఎస్‌కోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి



మాట్లాడుతున్న లలితకుమారి

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో బీసీలను అన్నివిధాలుగా అణగదొక్కిన ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం పోతనాపల్లి గ్రామంలో టీడీపీ నేత కూనిరెడ్డి రాముడు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం, సంతగైరమ్మపేట, వినాయకపల్లి, పోతనాపల్లి ముఖ్యనేతలతో ఆమె మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అన్ని బీసీ కులాల వారి ఆర్థిక అభివృద్ధికి పథకాలు అమలు చేసిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి.. ఆ కుటుంబాలకు తీరని నష్టం కలిగించారన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు బీసీలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, చెక్కా కిరణ్, లగడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** జగన్ అబద్ధాలకోరని.. మరోమారు తన అబద్ధాలతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధం సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారని ఎస్.కోట టీడీపీ ఇన్‌చార్జ్ కోళ్ల లలితకుమారి విమర్శించారు. మంగళవారం టీడీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నాసిరకం సారాతో లక్షల కోట్ల వ్యాపారం చేశాడని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు బిల్లులు పెంచి పేదల నడ్డి విరిచాడని మండిపడ్డారు. ఇసుక ఫ్రీగా ఇస్తానని చెప్పి అందనంత ఎత్తుకు ధరలు పెంచాడని దుయ్యబట్టారు. కూటమితో ఓటమి తప్పదని గ్రహించిన జగన్ మతిభ్రమించి పిచ్చి హామీలు ఇస్తున్నాడని విమర్శించారు. టీడీపీ నేతలు సాగర్ కల్యాణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులంటే అంత అలుసా?

● వసతులు లేని ఇంటిలో విద్యార్థుల అవస్థలపై బేబీనాయన ఆగ్రహం



పిరిడిలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి, మార్చి 12: బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో బీసీ విద్యార్థుల వసతి గృహంలోని సమస్యలను స్వయంగా పరిశీలించిన టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బేబీనాయన మంగళవారం పిరిడి గ్రామానికి వెళ్లి హాస్టల్‌ను సందర్శించారు. 52 మంది బీసీ విద్యార్థులను ఖాళీ చేయించి ఆ భవనాన్ని రైతుభరోసా కేంద్రానికి అప్పగించినట్టు విద్యార్థులంతా ఆయనకు తెలిపారు. ప్రస్తుతం ఓ చిన్న పెంకుటింటిలో ఎటువంటి సౌకర్యాలు లేని వాతావరణంలో దుర్భరంగా గడుపుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీరు, స్నానపు గది లేక నానా అవస్థలు పడుతున్నామనివాపోయారు. ఇంటి యజమాని అనుమతితో అదనంగా స్నానపు గదిని, తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తానని బేబీనాయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోనికి రాగానే సకల సౌకర్యాలతో విద్యార్థులకు వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన గ్రామపెద్దలతో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించారు. ఆయన వెంట పిరిడి గ్రామ పెద్దలు జాగాన రామకృష్ణరంగారావు, గర్భాపు పరశురామ్, గుంట తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి టీడీపీ కృషి



మాట్లాడుతున్న ప్రసాదుల కనకమహాలక్ష్మి

విజయనగరం రూరల్: మహిళా అభ్యున్నతికి టీడీపీ ఎంతో కృషి చేసిందని విజయనగరం మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి చెప్పారు. టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నగరంలోని 7, 8 డివిజన్ల డ్వాక్రా సంఘాలతో దాసన్నపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేయాలన్న టీడీపీ నిర్ణయం చరిత్రాత్మకమైన్నారు. డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత, వ్యాపార అవకాశాలు, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు కల్పించిన ఘనత టీడీపీ కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు రౌతు పద్మ, టీడీపీ మహిళా విభాగం నాయకులు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, మురిపేన పద్మలత, వీరలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయండి

● అదితి గజపతిరాజు



వాకర్స్ సభ్యులతో మాట్లాడుతున్న అదితి

విజయనగరం రూరల్, మార్చి 12: రాష్ట్రాభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి గెలిపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు వాకర్స్ క్లబ్ సభ్యులకు పిలుపునిచ్చారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా వారందరితో మాట్లాడారు. వారందరినీ పరిచయం చేసుకుని, వాకర్స్ క్లబ్ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె వాకర్స్‌ని ఉద్దేశించి మాట్లాడారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు, టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కొర్నాన రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకుడు నమ్మి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు గణితంలో నూటికి నూరు శాతం మార్కులు సాధిస్తే.. తమకు నచ్చిన కార్పొరేట్ కళాశాలలో చదువుకునేందుకు 50 శాతం ఫీజును భరించనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో 50 శాతం ఫీజు చెల్లిస్తానని మాట ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఆర్థికంగా సహాయ పడేందుకు గొంప కృష్ణ విద్యాసంకల్పం ప్రారంభించానన్నారు. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, జామి, ఎల్.కోట మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 361 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షల సామగ్రి అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, అడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడు.. మామల అక్రమార్జనకు రెండు కౌంటర్లు

● కోలగట్ల పాలనలో నగరంలో అశాంతి

● వైసీపీ నేత కాళ్ల గౌరీశంకర్



మాట్లాడుతున్న కాళ్ల గౌరీశంకర్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కబ్జాలు, కమీషన్లతో అక్రమార్జనకు మామ కోలగట్ల, అల్లుడు కౌశిక్ కౌంటర్లు తెరిచారని... భూమి పాస్‌బుక్ నుంచి కుళాయి కనెక్షన్ వరకూ తన వద్దకే రావాలంటూ కార్పొరేటర్లును డమ్మీచేసిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామిదేనని విజయనగరం కో-ఆపరేటివ్, అర్బన్ చైర్మన్, ఉడా మాజీ డైరెక్టర్, వైసీపీ నాయకులు కాళ్ల గౌరీశంకర్ ఆరోపించారు. నగరంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోలగట్లపై ఆయన విరుచుకు పడ్డారు. కోలగట్ల వీరభద్ర స్వామి ఎన్నికైన తరువాత నగరంలో అశాంతి నెల కొందని... కత్తులు స్వైరవిహారం చేస్తున్నాయని అన్నారు. 2020 నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో ఓ బీజేపీ కార్యకర్తపై కత్తులతో దాడి చేసి చంపాలని చూసింది ఎవరో నగర ప్రజలకు తెలుసన్నారు. కోలగట్ల నియంతృత్వ ధోరణితో అనేక మంది వైసీపీని వీడుతున్నారన్నారు. నగరం చుట్టపక్కల భూకబ్జాలు పెరిగిపోయాయని, నగర పాలక సంస్థ, రెవెన్యూ వ్యవస్థను కూడా స్వామి కబ్జాచేసి ప్రభుత్వ శాఖలను తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని... వారి హక్కులను ఎ మ్మెల్యే కబ్జా చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అదితి గజపతిరాజు విజయమే లక్ష్యంగా పనిచేస్తానని, కోలగట్ల ఓటమికి కంకణం కట్టుకుంటామని గౌరీశంకర్ అన్నారు. కోలగట్ల ఎమ్మెల్యే అయిన తరువాత ఆయన చేసిన అక్రమాలను త్వరలో బయట పెడతానని చెప్పారు. నగరంలో శాంతిభద్రతలు ఉండాలంటే.. టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత తమకాళ్లపై నిలబడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

రేగిడి, మార్చి 12: యువతీ యువకులు స్వయం ఉపాధితో తమ కాళ్లపై తాము నిలబడాలని, ఇందుకు టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి గోవిందరావు, రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడమెట్ట వద్ద మంగళవారం టూ వీలర్ నిర్వహణపై జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 35 మంది నిరుద్యోగయువతకు నెల రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణను బొత్స గురివి నాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇందుకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ తోడ్పాటునందిస్తుందని, సబ్సిడీపై రుణసాయం అందించి వారి జీవితాలు తీర్చిదిద్దుతామని స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి తెలిపారు. మండల స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ గణపతిరావు, సొసైటీ పీవో రవికిరణ్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి బ్యాటరీ సైకిల్ వితరణ



బ్యాటరీ సైకిల్ అందిస్తున్న గ్రామ పెద్దలు, గణేష్ మాస్టారు

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాలవలస గణేష్ మానవత్వం చాటుకున్నారు. స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన గొర్లె నారాయణరావుకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. అతని కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో పాటు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నాడు. దీన్ని గుర్తించిన నారాయణరావు... బ్యాటరీ సైకిల్ ను గణేష్‌కు మంగళవారం అందించారు. మాజీ సర్పంచ్ గొర్లె దేముడు, గ్రామ యువత గణేష్ మాస్టారును అభినందించారు.

53 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రామభద్రపురం, మార్చి 12: మండల పరిధిలోని కొండకెంగువ గ్రామానికి చెందిన 53 మందికి ఇళ్లస్థల పట్టాలను మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు చేతులమీదుగా అందజేశారు. మంగళవారం 'ఇళ్ల పట్టాలు ఇచ్చేదెప్పుడు?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి తమకు పట్టాలు లభించాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లుగా పట్టాలు పంపిణీ చేయకుండా జాప్యం చేశారని, గ్రామాల్లో ఉన్న రాజకీయ కక్షల్లో భాగంగా ఇన్నాళ్లు జాప్యం జరిగిందని, అయితే ఆంధ్ర జ్యోతి కథనంతోనే మాకు న్యాయం జరిగిందని గ్రామానికి చెందిన పట్టా లబ్ధిదారుడు రౌతు మధు, మరికొంతమంది తెలిపారు. జడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపీపీ బెవర ప్రసాద్, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలతలతో పనిచేస్తేనే వేతనం గిట్టుబాటు

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండుపూటలా కొలతల మేరకు పనిచేయాలని, లేకపోతే రూ. 272లు వేతనం గిట్టుబాటు కాదని ఉపాధి ఏపీవో హరనాథ్ పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడ పంచాయతీలో మంగళవారం వసంత చెరువుకు జరుగుతున్న ఉపాధి పనిని పర్యవేక్షించారు. టీఏ రాంబాబు, ఎఫ్ఏ రామకృష్ణ, మేట్లు పాల్గొన్నారు.

బాలికావలసలో వైద్యశిబిరం

రేగిడి: మండలంలో బాలికావలస గ్రామంలో మంగళవారం రాజాం లోని ఓ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ వైద్యులు డా. మేఘనందన్ 100 మందికి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు.

సృష్టికి మూలం మహిళే

● జేఎన్‌టీయూలో ఘనంగా మహిళా దినోత్సవం



పద్మావతిని సన్మానిస్తున్న జేఎన్‌టీయూ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

విజయనగరం రూరల్, మార్చి 12: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని కళాశాల ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విజయం సాధించిన మహిళలను జేఎన్‌టీయూ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కె వెంకట సుబ్బయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. సృష్టికి మూలం మహిళేనని, గతంతో పోల్చితే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుని వెళ్తున్నారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన భీముని పట్టణం పాలిటెక్నిక్ కళాశాల ఈసీఈ డిపార్టుమెంట్ హెడ్ డాక్టరు పద్మావతి మాట్లాడుతూ మహిళలు సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. మరో అతిధిగా హాజరైన డాక్టరు బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రజనీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఇందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు పద్మలీల, జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ జి జయసుమ, డాక్టరు బి నళినిలను ఘనంగా సన్మానించారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి



తమ్మినాయుడు (ఫైల్)

తెర్లాం, మార్చి 12: ఆటోను లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెరుమాలి సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం నుంచి బాడంగి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటోను పెరుమాలి సమీపంలో రాజాం వైపు నుంచి వస్తున్న ఒక గుర్తు తెలియని లారీ వెనుకనుంచి వచ్చి బలంగా ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి ఆటోలో ప్రయాణిస్తున్న చినపాలవలసకు చెందిన చల్లారపు తమ్మినాయుడు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో ఆటోలో ఐదుగురు ప్రయాణిస్తుండగా మిగిలిన వారంతా స్వల్పంగా గాయపడ్డారు. మృతుడు తమ్మినాయుడు రోజువారీ వ్యవసాయ కూలీ అని, అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఎస్ఐ రమేష్ తెలిపారు. పెద్ద కుమార్తె సాయినిఖితకు వివాహం కాగా, రెండో కుమార్తె నీలిమ చదువుకుంటోందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయి.. వ్యక్తి మృతి

భోగాపురం: వ్యక్తి మృతి చెంది పడి ఉన్న ఘటన భోగాపురం పంచాయతీ అప్పన్నపేట గ్రామం గెడ్డ సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ పి.సూర్యకుమారి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన నొడగల అప్పన్న(48) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన అప్పన్న నిత్యం మద్యం తాగుతుండే వాడు. మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించడంతో ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువుల దగ్గర ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి అప్పన్నపేట గ్రామంలోని గెడ్డ సమీపంలో అప్పన్న శవమై ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో చనిపోయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై మృతుడి కుమారుడు నొడగల రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

ఎస్‌ఎమ్‌ఎస్ పరిశ్రమలో చోరీ

సుమారు రూ. 18లక్షల విలువ గల కేబుళ్లు మాయం



కేబుల్‌లు దొంగలిస్తుండగా పట్టుబడిన వాహనం

పూసపాటిరేగ: మండలంలో కందివలస పంచాయతీలో గల ఎస్ఎమ్ఎస్ పరిశ్రమలో సుమారు రూ. 18 లక్షల విలువగల కేబుళ్లు చోరీ జరిగింది. గత కొంతకాలంగా ఈకేబుళ్లు చోరీ అవుతుండటంతో పరిశ్రమ సెక్యూరిటీ ప్రత్యేక నిఘా పెట్టడంతో కేబుళ్లను దొంగతనంగా తరలిస్తున్న వాహనం సోమవారం పట్టుబడింది. కొందరు పరిశ్రమ గోడవద్ద ఒక వాహనాన్ని నిలిపి ఈ కేబుళ్లను వాహనంపై లోడుచేసి చోరీకి పాల్పడుతున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోవడంతో ఈ వాహనాన్ని దుండగులు అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఇందులో తరలిస్తున్న కేబుళ్ల విలువ సుమారుగా 8లక్షల రూపాయల వరకూ ఉండవచ్చునని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దుండగులు పలుమార్లు సుమారుగా 18 లక్షల రూపాయల విలువగల ఈకేబుల్‌లు దొంగలించినట్టు పరిశ్రమ సిబ్బంది తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

40 లీటర్ల సారా స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 40 లీటర్ల సారా, వెయ్యి లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను పట్టుకున్నామని సెబీ ఇన్‌స్పెక్టర్ బీవీ మురళీధర్ తెలిపారు. ఏఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డ బెల్లం ఊటను ధ్వంసం చేశామని, సారాను పట్టుకొని నిందితుల కోసం ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్‌వీ రామారావు, సిబ్బంది పి.జయరామ్‌నాయుడు, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యాన్ బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

రామభద్రపురం: మండలంలో జొన్నవలస రోడ్డు వద్ద సాలూరు నుంచి రామభద్రపురం వస్తున్న వ్యాన్ ఎదురుగా రామభద్రపురం నుంచి సాలూరు వైపు వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న సాలూరుకు చెందిన రాకేష్, సూరజ్, రమేష్ తీవ్ర గాయాల పాలయ్యారని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సూరజ్ పరిస్థితి ఆందోళనగా ఉండడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, మిగిలిన ఇద్దరూ సాలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

జూదరుల అరెస్టు

బొబ్బిలి: మండలంలోని రాచ్చెరువలస గ్రామ సమీపంలో పేకాటాడుతుండగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. వారి నుంచి 40,030 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

దంపతుల ఆత్మహత్యా యత్నం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన దంపతులు అప్పుల బాధ తాళ లేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. మెయిన్ రోడ్డులో బ్రిడ్జికి సమీపంలో వీరు గొంతుకు స్వల్పంగా గాయం చేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం ఈ కుటుంబం గతంలో కిరాణా వ్యాపారం చేసేది. ఈ క్రమంలో రెండు కోట్ల వరకూ అప్పు చేశారు. ఆ తరువాత వ్యాపారం సక్రమంగా జరగక, అటు అప్పులు తీర్చే దారి లేక, వీరు వేరే గ్రామానికి మకాం మార్చారు. తమకు రావాల్సిన బకాయిల కోసం రుణదాతలు పదే పదే ఫోన్లు చేయడంతో, మనస్తాపం చెందిన వీరు మంగళవారం పట్టణానికి చేరుకొని, రాజాం రోడ్డులో బ్రిడ్జికి సమీపంలో గొంతుపై గాయం చేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. కాగా, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వీరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

వందేభారత్ రైలుకు స్వాగతం

విజయనగరం దాసన్నపేట: వందేభారత్ రైళ్లను మంగళవారం పర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విశాఖపట్టణం నుంచి పూరీ వెళ్లే వందేభారత్ రైలుకు బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇసుక వాహనాలను ఎలా విడిచిపెట్టారు?



తహసీల్దార్‌కు దరఖాస్తు అందిస్తున్న ఉదయశేఖరపాత్రుడు

కొమరాడ: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సోమవారం సాయంత్రం పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగిస్తే ఎలా విడిచి పెట్టారని టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు.. తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈమేరకు దరఖాస్తును అందించారు. ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న వే బిల్లులు ప్రభుత్వ అనుమతితో ఉన్నాయా.. ఉంటే ఇసుక రేవుకు సంబంధించిన అనుమతులు, వాటి పత్రాలను సమాచార హక్కు చట్టం ద్వారా అందివ్వాలని ఆయన కోరారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఒక వైపు మైన్స్ ఏడీ కూనేరు రామభద్రపురం వద్ద నాగావళి నదిలో ఇసుక తీసేందుకు ఎటువంటి అనుమతులు లేవని చెబుతున్నప్పటికీ అధికారుల కార్యాలయాల ముందు నుంచే ఇసుకతో ట్రాక్టర్లు, లారీలు వెళుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనధికారికంగా వైసీపీ నాయకులు ఇసుకను దోచుకుంటున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై న్యాయ పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

వ్యర్థాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకుని చెరువు ప్రాంతంలో గరుగుబిల్లిలో సేకరించిన వ్యర్థాలను కుప్పలుగా వేయడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా తయారయ్యింది. రహదారులకు ఆనుకుని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం ఈ ప్రాంతం ఒక వైపు పొగతో పాటు మరో వైపు దుర్గంధభరితంగా తయారయ్యింది. ఉద్యోగులు పడుతున్న అవస్థలపై 'కార్యాలయాల ముందు వ్యర్థాలు' శీర్షికన ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఈకథనంపై మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, కార్యదర్శి డి.జగదీశ్వరరావు స్పందించారు. వ్యర్థాలను వేరే ప్రాంతానికి తరలించే చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఉద్యోగులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సాలూరు: పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో సత్యవతి తెలిపారు. పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 23 వరకు పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ● **కురుపాం:** పోషణ పక్వాడ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.విజయగౌరి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోగల అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ పీవో విజయగౌరి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ర్యాలీ

సాలూరు: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర అంగన్‌వాడీల ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు బి.రాధ కోరారు. పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు.

అర్హులందరికీ పథకాలు

సాలూరు: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నాలుగో విడత చేయూత కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

సాలూరు: పట్టణంలోని బంగారమ్మపేటలో ఉన్న పౌర సరఫరాల డిపో1లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ బి.సింహాచలం మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే పరిశీలించామని తెలిపారు. చిన్న చిన్న లోపాలు మాత్రమే గుర్తించామని, వాటిని సీఎస్‌డీటీ రంగారావుకు తెలియజేశామన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే గుమ్మిడిగెడ్డకు కష్టాలు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: వైసీపీ, టీడీపీల నిర్లక్ష్యం వల్లనే గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తి కాలేదని సీపీఎం నాయకులు మండంగి రమణ ధ్వజమెత్తారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దగూడలో సీపీఎం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మిస్తే కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలు తగ్గేలా దృష్టి సారించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో మాతా శిశు మరణాలు నిరోధానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి పీడీ వై.సత్యంనాయుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో మాతా శిశు మరణాల రేటు 24 శాతం ఉండేదని, ప్రస్తుతం 8 శాతానికి తగ్గుముఖం పట్టిందన్నారు. గ్రామైఖ్య సంఘాల సభ్యులు ఇంటింటికి వెళ్లి గర్భిణులకు పోషక పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు బి.రామినాయుడు, సీహెచ్ తిరుపతిరావు, ప్రసాద్, ఆర్.కృష్ణ, వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

గరుగుబిల్లి: గ్రామ స్థాయిలో పూర్తి స్థాయి అక్షరాస్యత ఉన్నట్లయితే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. సంతోషపురం, సుంకి పంచాయతీల్లో మంగళవారం అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు అక్షరాస్యత సాధిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటారన్నారు. అనంతరం డిజిటల్ అక్షరాస్యత, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

సాలూరు(పాచిపెంట): ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు పాచిపెంటలో మంగళవారం నిరసన చేపట్టారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రరంగంలోనే ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.అప్పలస్వామి, కె.కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



దాసును సన్మానిస్తున్న దృశ్యం

మక్కువ: మార్కొండపుట్టి నుంచి పనసభద్ర గ్రామంలో నూతన నిర్మించిన ఆర్సీఎం చర్చి వరకు సుమారు మూడు వేల మంది క్రైస్తవులు మంగళవారం పాప పశ్చాత్తాప పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడ్డ దాసు, విశాఖపట్నం నుంచి బిషప్, పొలిమేర జయరాజు హాజరయ్యారు. క్రైస్తవ గురువులను సన్మానించారు. అనంతరం ఎర్ర సామంతవలస చర్చి ఫాదర్ జీవన్‌బాబు ఆధ్వర్యంలో ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు.

కూరగాయల పంటలపై అవగాహన

సాలూరు (పాచిపెంట): కూరగాయల పంటల సాగుపై మంగళవారం అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అమ్మవలస, కొత్తవలస, గోగాడవలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రాబోయే ఖరీఫ్‌కు నవధాన్యాలను సిద్ధం చేసి.. ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని రైతు సాధికారిత సంస్థ పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కన్సల్టెంట్ కె.రమాప్రభ అన్నారు. ఏవో కె.తిరుపతిరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీపై అవగాహన కల్పించాలి

పాలకొండ: ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీకి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 31లోపు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయ్‌చంద్ర అన్నారు. వెంకటాపురం పంచాయతీ చిన్నయ్యవలస గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు, గొట్టాపు వెంకటినాయుడు మాజీ సర్పంచ్ పైల నాగభూషణరావు, బి.వెంకటరమణ, బి.చిరంజీవి, మర్రాపు శంకరరావు, రెడ్డి సింహాలురావు పాల్గొన్నారు. **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** టీడీపీ, జనసేన ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కె.నారాయణరావు, రవికుమార్, మజ్జి వెంకటేష్, కోలా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాల చేరిక

పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన నల్ల అప్పలనాయుడు, నల్లగౌరునాయుడు, నల్ల లక్ష్మణరావు తదితర సుమారు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. మంగళవారం రాత్రి బోనెల విజయచంద్ర ఇంటి వద్ద వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, బోనుదేవి చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీదే విజయం: మాజీ మంత్రి శత్రుచర్ల

కొమరాడ: వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయమని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. మంగళవారం పూడేసు, మసిమండ, పెద్దశాఖ పంచాయతీల నుంచి వైసీపీ నుంచి వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని అన్నారు. మండల పార్టీ కన్వీనర్ ఉదయశేఖర పాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శత్రుచర్ల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తన రాజకీయ వారసురాలు, తెలుగుదేశం,



మాట్లాడుతున్న మాజీ మంత్రి విజయరామరాజు

జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీరేష్‌దేవ్, టీడీపీ అభ్యర్థి జగదీశ్వరి, జనసేన సమన్వయకర్త మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి: సంధ్యారాణి

సాలూరు: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ-జనసేన బలపరిచిన అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రజలను కోరారు. పట్టణంలోని 28వ వార్డులో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా



సాలూరు: సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న సంధ్యారాణి



పార్వతీపురం: టీడీపీలో చేరిన వారితో బోనెల విజయచంద్ర

వార్డులో ఉన్న సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన ఈ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని తెలిపారు. అడుగడుగునా ఆమెకు ప్రజలు నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, వాడాడ శోభారాణి, కారేపు చంద్రతో పాటు పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి: తిరుపతిరావు



గిరిజన యువతతో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తిరుపతిరావు

మక్కువ: టీడీపీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు కోరారు. నంద గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు వైసీపీ ప్రభుత్వంలో గిరిజన ప్రజలకు అభివృద్ధి శూన్యమని తెలిపారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలలో శంబర ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, చొక్కాపు బుచ్చినాయుడు, మేలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తెలుసుకోండి: జేసీ

పార్వతీపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె.. ఎన్నికల సమయంలో పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. నామినేషన్లు దాఖలు చేసినప్పుడు నామినేషన్ పత్రాలతో పాటు అందించాల్సిన పత్రాలు, ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ఖర్చు, ప్రచారం కోసం అనుమతులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద ఓటింగ్, ఎన్నికల సమయంలో చేయాల్సిన పనులు, చేయరాని పనులపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు 85ఏళ్ల దాటి పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులకు ఇంటి వద్ద ఓటు వేసుకునే సదుపాయం కల్పిస్తారని, దానికి ముందుగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రచారానికి సంబంధించి వాహనాలు, లౌడ్ స్పీకర్లు, సమావేశాలు, ఊరేగింపులకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున, పోలింగ్‌కు ముందు ప్రింట్ మీడియాలో ప్రచురించే ప్రకటనలకు అనుమతులు అవసరమన్నారు. ప్రార్థనా మందిరాల్లో ప్రచారం చేయకూడదన్నారు. ఈ అవగాహన సదస్సులో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్వీ సూర్యనారాయణ, డీపీఆర్వో లోచర్ల రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.వెంకటనాయుడు, పారిశర్ల అప్పారావు, వి.శ్రీనివాసరావు, పాపారావు, పైల శ్రీనివాసరావు, పి.రవికుమార్, వై.మన్మథరావు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి

సాలూరు: ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు



పాలకొండ: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సంబంధించిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఆనందరావు, శ్రీమతి బాల, సింహాచలం, కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

పాలకొండ: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ చంద్రమౌళి కోరారు. పట్టణంలోని వడమ, నక్కలపేట, ఇందిరానగర్‌కాలనీ ప్రధాన రహదారుల్లో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా ప్రజలతో మమేకమయ్యేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

సాలూరు రూరల్: ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ఎనిమిది మండలాల్లోని రోడ్డు మార్గాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఏవోబీలో ధూళిభద్ర సమీపాన, నేరేళ్లవలస, సారిక, దండిగాం, కురుకూటి మార్గాల్లో రూట్ నెంబర్ 17లో మంగళవారం ఈ తనిఖీలు చేశారు. ఆ రూట్లలో ఉన్న పోలింగ్ స్టేషన్లుకు వెళ్లే మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కల్వర్టులను బాంబ్‌స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నట్టు ఎస్.ఐ. వెంకటరమణ చెప్పారు.

పరీక్షలు బాగా రాయండి

కురుపాం: సమయం తక్కువగా ఉన్నందున సద్వినియోగం చేసుకొని ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కురుపాం తహసీల్దార్ శంకరరావు టెన్త్ విద్యార్థులకు సూచించారు. కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాల స్పెషల్ ఆఫీసరుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ శంకరరావు.. పదో తరగతి విద్యార్థులు ఎలా చదవాలి? పరీక్షలలో భయపడకుండా ఎలా రాయాలి అనే విషయాలపై మంగళవారం సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **భామిని:** పదో తరగతి వార్షిక పరీక్షలు ధైర్యంగా రాయాలని ఎంపీడీవో కిషోర్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించి పదో తరగతి పరీక్షలకు రాసే విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు రాసేటప్పుడు ప్రశాంతంగా రాయాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ విజయనిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు చర్యలు

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంఈవో ఎన్.నాగభూషణరావు తెలిపారు. మంగళవారం ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడి ఉన్నవారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలపై భయం పోగొట్టే విధంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీసీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

వీరఘట్టం: మండలంలోని బిటివాడ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కె.జయప్రకాష్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 18 నుంచి 27వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నందున పరీక్షా కేంద్రంలో గదులను తనిఖీ చేసి హెచ్ఎం రత్నాకర్‌రావుకు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా చూడాలన్నారు. ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి:ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో నాగభూషణరావు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సాలూరు రూరల్: పదో తరగతిలో శతశాతం ఫలితాలను సాధించాలని ఎంఈవో 1, పెదబోరబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారి బి.రాజుకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పెదబోరబంద ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ సరైన ప్రణాళికతో సన్నద్ధమయితే పరీక్షలు బాగా రాయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

పాలకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాలకొండ ఉప విద్యా శాఖాధికారి శ్రీకృష్ణ, ఎంపీడీవో రామకృష్ణ హాజరయ్యారు. హెచ్ఎం మీసాల సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సోషల్ మీడియా గౌరవంతో ఉండాలి

● డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: సోషల్ మీడియా మహిళల పట్ల గౌరవంతో ఉండాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. బాగువలసలో మంగళవారం వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అధ్యక్షతన చేయూత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా తీరుతో ఒక మహిళ రైలు పట్టాలపై ప్రాణాలు విడవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాలూరులో ప్రత్యర్థులు దుర్భాషలాడినా సరే అటువంటి భాషను వాడొద్దని తన సోషల్ మీడియా సైన్యానికి ఆదేశించానన్నారు. తాము మహిళల పట్ల గౌరవంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్మన్ దండి అనంత కుమారి శ్రీనివాస్, కళ్లేపల్లి త్రినాథ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మరో 71 అభిలాష గ్రంథాలయాలు ప్రారంభం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో మరో 71 అభిలాష గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇప్పటికే 98 గ్రంథాయాలు గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువత కోసం ఈ గ్రంథాలయాల్లో 132 పుస్తకాలను అందుబాటులో ఉంచారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం 27 సెట్ల (54 పుస్తకాలు)ను అందుబాటులో ఉంచారు. అభిలాష గ్రంథాలయాల్లో 2,748 మంది పుస్తకాలు పొందడానికి యాప్‌లో ఇప్పటివరకు నమోదు చేసుకున్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని కేజీబీవీలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశించేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల పనివేళల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల్లోపు నేరుగా సంప్రదించవచ్చునన్నారు.

16న చెరకు గానుగ ముగింపు

సీతానగరం: సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం 2023-24 చెరకు గానుగను ఈనెల 16న ముగించనున్నట్లు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి, చెరకు అభివృద్ధి జీఎం జె.రాజేంద్రన్, హెచ్ఆర్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్స్ మేనేజర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు కర్మాగారంలో 3.73 లక్షల టన్నుల చెరకును గానుగ ఆడించినట్టు చెప్పారు. ముగింపు సమయానికి 3.87 లక్షలు పూర్తి చేస్తామన్నారు. కర్మాగారం పరిధిలో 2.90 లక్షల టన్నులు, బొబ్బిలి జోన్ పరిధిలో 91 వేలు, భీమసింగి ద్వారా 632 టన్నుల చెరకు వచ్చిందన్నారు. క్రషింగ్ లక్ష్యం నాలుగు లక్షల టన్నులు కాగా 13 వేలు తగ్గిందన్నారు. 10 వేల ఎకరాల్లో రైతులు పంట వేసినట్టు తెలిపారు. ఈ ఏడాది రికవరీ 9.24 శాతం నమోదైనట్లు వివరించారు. చెరకు సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గరుగుబిల్లి: రావుపల్లిలో ఈ నెల 14న శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి చెందిన వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆశయ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చుక్క జగన్, పి.భార్గవ్‌రాము, సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటరమణలు తెలిపారు.

19 నుంచి సంతోషిమాత ఉత్సవాలు

భామిని:బత్తిలిలో సంతోషిమాత ఆలయ 38వ వార్షికోత్సవం ఈనెల 19 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతరకు ముందు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు మంగళవారం పూజలు చేశారు. ఏ కార్య క్రమం జరిగినా మొదట గ్రామ దేవతకు పూజలు చేయడం ఆనవాయితీ అని ఆలయ అర్చకుడు తాతబాబుశర్మ తెలిపారు.

ఒడిశా

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న మంత్రి జగన్నాథ సారక

రాయగడ: స్థానిక సమితి కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు ఇతర పరికరాలను అందజేశారు. సీఎస్ఆర్ ఇనిషియేటివ్ కింద ఆర్టిఫీషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ సహకారంతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌వారు ఈ ఉచిత పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జగన్నాథ సారక, ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయా మాఝి, శాసన సభ్యుడు మకరంద ముదిలి, సమితి అధ్యక్షురాలు టుని హుయిక, పరపాలక ఉపాధ్యక్షురాలు శుభ్రపండా, జిల్లా ప్రజాసంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 11 సమితులకు చెందిన అనేకమంది దివ్యాంగులు ఈ పరికరాలను అందుకున్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వాహణపై స్థానిక ఆటానమస్ కళాశాలలో మంగళవారం అన్ని విభాగాల అధికారులకు శిక్షణా తరగతులు ప్రారంభ మయ్యాయి. ఈనెల 18 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ తెలిపారు. శిబిరంలో ప్రిసైడింగ్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా ఏ పార్టీకి కొమ్ముకాయకుండా ఎన్నికలు ఎలా నిర్వహించాలో శిక్షణ ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన



వేదికపై ముదిలి, పట్నాయక్ తదితరులు

రాయగడ: దేశంలో ప్రజా రవాణా మెరుగు పర్చేందుకు ప్రధాని మోడీ మంగళవారం రూ.85వేల కోట్లతో పలు రైల్వే ప్రాజెక్టు లకు శంకుస్థాపన చేశారు. వర్చువల్‌గా పది వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఒడిశాలో పూరీ-విశాఖల మధ్య నడిచే వందేభారత్ రైలును ప్రారంభించారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్వే అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో శాసన సభ్యుడు మకరంద ముదిలి, సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.